# మరీచిక

ఇండియన్ బుక్స్ ఎగ్జిబిషన్ ఉందిరమ్మని డాక్టర్ శేఖర్ ఫోను చేశాడు. నేను అప్పుడే హాస్టలు చేరుకొన్నాను. ఇంతలో ఫోను వచ్చింది. నేను లండను వచ్చి నాలుగు నెలలయింది. ఇంకో రెండు నెలలకుగానీ నా ట్రైనింగు పూర్తికాదు. ఇన్ఫర్మేషన్ టెక్నిక్స్‌కు సంబంధించిన పబ్లిక్ రిలేషన్స్ కోర్సు ఇది.

మన దేశానికి దూరంగా ఉన్నందున ఇండియా అనిగానీ, ఇండియన్ అని గానీ వింటే శరీరం పులకరించేది. అందుకే తప్పక వస్తానని చెప్పాను శేఖర్‌తో.

డాక్టర్ శేఖర్‌తో పరిచయం కూడా అనుకోకుండా జరిగింది. నేను ఇంగ్లాండు వచ్చిన కొత్తలో ఒక రోజు నిద్రలేవగానే కొద్దిగా తలభారంగా అనిపించింది. భయపడ్డాను, జలుబుగానీ పట్టుకోదుగదా అని. చలిదేశాలలో జలుబంటే గొప్ప చిక్కే. పక్కలో నుంచి కదలటానికి ఉండదు. ట్రైనింగు కోసమని వచ్చి జబ్బుపడితే... ఆ జలుబుకాస్త జ్వరంగా మారిందంటే వీళ్లు తీసుకెళ్ళి నన్ను ఆస్పత్రిలో పడేస్తారు. నా పని గోవిందా....

ఇన్ని ఆలోచనలతో లేచి టైమ్ చూద్దునుగదా ఎనిమిదన్నరైంది. బాపురే. ఇంకో అరగంటలో అండర్ గ్రౌండ్ ట్రైన్ పట్టుకోకుంటే తొమ్మిదిన్నరకు ఆఫీసు చేరేది కష్టమే. గబగబా బ్రష్ చేసుకొని వేడినీళ్లతో మొహం కడుక్కొని డ్రెస్ చేసుకొన్నాను. పరుగుపరుగున డైనింగ్ హాలు చేరాను. అప్పటికే పదిహేను నిముషాలు తక్కువ తొమ్మిది. మా హాస్టలు

నుండి అండర్ గ్రౌండ్ స్టేషనుకు ఐదు నిముషాల నడక. దగ్గర పాస్ ఉంది కాబట్టి టిక్కెట్టు కౌంటర్లో నిలుచోనవసరం లేదు. కానీ ఆ మెట్లన్నీ దిగి (కదిలే మెట్లయినా) నేను వెళ్లే ట్రైను చేరుకోవడానికి మరో ఐదు నిముషాలు. అంటే నాకు బ్రేక్ ఫాస్ట్‌కు ఐదునిముషాలుండన్నమాట. ఇంకేం బ్రేక్ ఫాస్ట్, జూస్ కౌంటరు దగ్గరే నిలబడి రెండు గ్లాసుల జ్యూస్ తాగి పరుగులాంటి నడకతో అండర్ గ్రౌండ్ చేరుకొన్నాను. ఒకటే ఈదురుగాలి. నేనటు ప్లాటుఫారం మీదకు పోవడం ఇటు ట్రైను రావడం ఒకేసారి జరిగింది.

ఆఫీసుకు రాగానే ఓవర్ కోటు కామన్ రూమ్‌లో తగిలించి కార్ మైఖేల్ క్లాసుకు వెళ్లాను. ఆయన అడ్వర్టయిజ్‌మెంట్ల గురించి నిన్న చెప్పిన లెక్చరు ఈ రోజు కొనసాగించారు. ఆ తర్వాత మమ్మల్ని ఒక యాడ్ తయారుచేయమని చెప్పి ఎటో వెళ్లారు.

తర్వాత "డాక్టర్ రవీ" అన్న పిలుపుకు ఉలిక్కిపడ్డాను. కార్‌మైఖేల్ అడుగుతున్నారు. "ఒంట్లో బాగాలేదా? వెళ్లి రెస్ట్ తీసుకుంటారా?" ఇంతవరకు వర్క్‌డెస్క్‌మీద తలపెట్టి పడుకొన్నానన్నమాట.

"సారీ ఐ యామ్ నాట్ వెల్."

"దట్సాల్ రైట్. టేక్ కేర్".

ఇంతలో కాఫీ బ్రేక్ వచ్చింది. హాస్టలుకు వెళ్తానన్నాను. వెళ్లమన్నారు. సాయంత్రం డాక్టర్ని తప్పక చూడమన్నారు. నాతోపాటు ట్రైనింగవుతున్న పీటర్ నైజీరియా నుండి వచ్చాడు. వద్దంటున్నా వినకుండా అండర్ గ్రౌండు స్టేషనుదాకా వచ్చాడు.

ఆ సాయంత్రం తలుపు చప్పుడికి మెలకువ వచ్చింది. తలుపుతీశాను.

"సారీ, నిద్రపోతున్నారా?" అని అడిగాడు చాన్. ఇతను హాంకాంగ్‌వాడు.

"నిద్రబట్టింది" అన్నాను అతను గదిలోకి రావడానికని తలుపుతీసి పట్టుకొని.

"డాక్టరు వద్దకు వెళ్దాం పదండి. నేనూ వస్తాను" అన్నాడు.

మాకు ఇచ్చిన హెల్త్ కార్డు తీసుకొని పది నిముషాల నడకలో క్లినిక్ చేరుకొన్నాం. అక్కడ ముగ్గురు, నలుగురు పేషంట్లు కాబోలు కుర్చీలలో కూర్చుని ఉన్నారు. చాన్ రిసెప్షనిస్టు దగ్గరకు వెళ్లి మాట్లాడుతున్నాడు.

"మా ఫ్రెండుకు జ్వరంగా ఉంది. డాక్టర్ని చూడాలి."

"పేరు?"

చెప్పాడు. ఆమె తన దగ్గరున్న లిస్టు చూసింది.

"సారీ మీకు అపాయింట్‌మెంట్ లేదు. ఈ రోజు టైమ్ తీసుకోండి రేపటికో ఎల్లుండికో."

చాన్ ఆమెకు దగ్గరలో ఉన్న బోర్డు వైపు వేలు చూపించాడు. "ఎమర్జెన్సీలో డాక్టరు అపాయింట్‌మెంట్ లేకున్నా చూస్తాడు" అని వ్రాసుంది.

ఆ అమ్మాయి నవ్వింది. నా వైపు చూసింది.

"ప్లీజ్ వెయిట్" అంది.

అక్కడ కుర్చీలలో కూర్చున్నాం. గాజు తలుపుల నుండి బయట తెల్లతెల్లగా మంచుకురవటం కనిపిస్తోంది. ఇండియాలో మనకు మంచు కురిసే స్థలాలు చాలా ఉన్నా మంచు కురవటం చూడటం నాకు అదే ప్రథమం. కాసేపు నా జబ్బు గురించి మరచిపోయి మంచు చూస్తూ కూర్చున్నాను.

"హలో యూ" అని ఆ అమ్మాయి పిలిచిన పిలుపుకు అటు చూశాను. దగ్గరకు వెళ్ళాను. ఒక చీటీ ఇచ్చింది.

"పైన ఈ కాబిన్‌కు వెళ్లండి" అంది. పైన నలుగురు డాక్టర్లు ఉన్నట్టున్నారు. ఒకో కాబిన్‌లో ఒకరు. నేను వెళ్ళిన కాబిన్‌లోని డాక్టర్ ఇండియన్.

"హలో" అని కూర్చోమన్నాడు.

నా హెల్త్ కార్డు చూపించాను.

"మీరు డాక్టరా?" అని అడిగాడు.

"సోషియాలజిలో" అన్నాను.

"తెలుగువారా" అని అడిగాడు తెలుగులో. నాకు సగం జబ్బు పోయినట్టయింది.

అవునన్నాను.

"నేను చంద్రశేఖరాన్ని"

ఆ తర్వాత మెడిసిన్స్ వ్రాసిచ్చాడు.

"రెండు రోజులు బాగా రెస్ట్ తీసుకోండి. మామూలు జలుబే" అన్నాడాయన.

"మీరిటునుండి వెళ్లి ఎడమవైపు తిరిగారంటే అక్కడ మందులషాపుంది. ఈ మందులు కొనుక్కోండి. ఇక్కడ హెల్తు సర్వీసు ఫ్రీగానీ మందుల ధర మాత్రం ఎక్కువే" అని నవ్వాడు. తన అడ్రసు, ఫోన్ నెంబర్ ఇచ్చి తనను కాంటాక్ట్ చేయమన్నాడు.

మందులు కొనుక్కొని నెత్తిన ఓ ప్లాస్టిక్ బ్యాగ్ అడ్డు పెట్టుకొని హాస్టలు చేరుకొన్నాను. ఇక్కడ అందరూ విధిగా గొడుగు పట్టుకెళ్తారు. నాకే అలవాటు కాలేదు. అందుకే ఈ బాధలన్నీ.

మంచు మెత్తగా కురుస్తూనే ఉంది. కొంత నా లెదర్ కోటు మీదుగా పడి జారుతోంది. అడుగులు చూసి వేస్తున్నాను. డాబాలమీద ఒకటీ అరా పిల్లలు మంచుతో ఆడుతూ కనిపించారు. హాస్టల్ రిసెప్షన్‌లో 'కీ' తీసుకుని చిన్న తోటలాంటిది దాటి నా గదికి వెళ్తున్నాను. ఇంతలో ఫెడీమని ఒక మంచు ముద్ద నా వీపుకు తగిలి కిందపడింది. ఉలికిపడి చూశాను.

అక్కడ ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు మంచుముద్దలు విసురుకొంటున్నారు. ఇద్దరు ఆఫ్రికన్లు, ఒకమ్మాయి చైనా అమ్మాయి. హాంకాంగ్ పిల్లకావచ్చు. ఆ పొట్టి పిల్ల "సారీ, సారీ" అంటూ అరిచింది. ఫర్వాలేదన్నట్టు చెయ్యి ఊపి ముందుకు సాగాను. వీళ్లంతా స్కాలర్ షిప్పుల మీద 'ఓ' లెవలో, 'ఏ' లెవలో ఏదో ఒక కోర్సు చేస్తూ ఉంటారు.

ఇంతవరకు చాన్ నాతోపాటే మౌనంగా నడుస్తున్నాడు. తన దగ్గర గొడుగు లేదు. తలకు అడ్డుగా ఏదీ పెట్టుకోనూ లేదు. తలంతా తెల్ల తెల్ల ముద్దలుగా ఉంది. నా గదికి చేరగానే "వేడిగా కాఫీగానీ, హార్లిక్స్‌గానీ తాగుతావా?" అని అడిగాడు. స్లాట్ మిషన్ (నాణెం వేయగానే పేపరు కప్పుతో సహా కాఫీ వచ్చే మిషన్) అక్కడే వరండా చివరలో ఉంది. హార్లిక్స్ అయితే తను లాంజ్ దాకా వెళ్ళాల్సి ఉంటుంది. కాఫీ తెమ్మని చెప్పాను.

ఆ జలుబు రెండు రోజుల్లో తగ్గింది. మూడో రోజు, నాలుగో రోజు శని ఆదివారాలు. బాగా విశ్రాంతి తీసుకోడంతో, సోమవారం మామూలు ఆరోగ్యంతో ఆఫీసుకు వెళ్లాను. అందరూ చాలా ప్రేమతో పలకరించారు. సెషల్స్ నుండి వచ్చిన జూలీ మాత్రం "ఎప్పుడు ప్రాక్టికల్ వర్క్ ఉన్నా తప్పించుకునే మార్గాలు వెతుక్కొంటావు" అంది ఏడిపిస్తున్నట్టు. ఆ సాయంత్రమే డాక్టర్ శేఖర్ నుండి ఫోను వచ్చింది. "బాగున్నారా" అని అడిగాడు.

"ఈదురుగాలికి తిరక్కండి. సాధ్యమైనంత వరకు మధ్యమధ్యలో వేడిగా ఏదైనా తాగండి" అని సలహా ఇచ్చాడు. ఆ వీక్ ఎండ్‌కి నన్ను రమ్మని పిలిచాడు. ఆయన ఇంకా బాచిలరే. ఇంగ్లాండు వచ్చి ఏడాదిన్నర అయిందట. ప్రస్తుతం వై.ఎం.సి.ఎ ఇండియన్ బ్రాంచ్ హాస్టల్లో ఉంటున్నాడు.

అప్పుడప్పుడు శని ఆదివారాల్లో ఏదో ఒక రోజు కలుస్తూ ఉండేవాళ్ళం. ఒకసారి హైడ్ పార్కులో తిరిగితే మరోసారి సెయింట్ జేమ్స్ పార్కులో తిరిగేవాళ్ళం. ఒకసారి థేమ్సు నది మీద బోటు షికారుకు వెళ్తే మరోసారి ఏ నాటకానికో వెళ్ళేవాళ్ళం. ఒకసారి షేక్స్‌పియర్ జన్మస్థలానికి వెళ్ళాం ఆక్స్‌ఫర్డు మీదుగా. దారిలో పచ్చికబయళ్లు, గుర్రాలు, ప్రకృతి సౌందర్యాలు మమ్మల్ని ఉక్రూతలూగించాయి. ఆ విధంగా నేనూ డాక్టర్ శేఖర్ బాగా దగ్గరయ్యాం.

అందుకే ఇండియన్ బుక్ ఎగ్జిబిషన్ జరుగుతోంది. ఇండియా హౌస్‌లో అని డాక్టర్ శేఖర్ ఫోనుచేయగానే ఏనుగెక్కినంత సంబరమైంది. ఇద్దరం విక్టోరియా స్టేషన్‌లో కలిశాం. ఆ తర్వాత ఇండియా హౌస్‌కు వెళ్లాం. ఎగ్జిబిషన్‌లో అన్ని భాషల పుస్తకాలూ ఉన్నాయి. అవన్నీ చూస్తుంటే ఒక్కసారిగా ఒళ్లు పులకరించింది. దానిలో తెలుగు పుస్తకాల సెక్షను కూడా ఒకటుంది. ఒక్కొక్కటే వివరంగా చూస్తుండగా ఒక పుస్తకం మీద నా చూపు నిలిచిపోయింది. ముచ్చటైన పుస్తకం. చక్కటి కవరు డిజైన్. రచయిత్రి... స్ఫూర్తి!

స్ఫూర్తి! స్ఫూర్తి అన్న పేరే మధురంగా నాలో రకరకాల రాగాలలో వినిపించసాగింది. ఇంక మరో పుస్తకం చూడాలనిగానీ అక్కడ మరోక్షణం ఉండాలనిగానీ అనిపించలేదు.

"ఈ పుస్తకం కొంటున్నారా?" అన్న డాక్టరు పిలుపుకి ఈ లోకంలోకి వచ్చాను. అతను ఆ పుస్తకం వైపే చూస్తున్నాడు. ఆ పుస్తకం నా చేతిలో ఉంది. ఆ చెయ్యి గుండెకు దగ్గరగా ఉంది. ధర చెల్లించి ఆ పుస్తకం తీసుకొన్నాను. అదృష్టంకొద్దీ కొన్ని పుస్తకాలు అమ్మకానికి పెట్టారు. వాటిలో ఇది ఒకటి.

వెచ్చని ఎండలో నడుచుకుంటూ చారింగ్ క్రాస్ దాకా వచ్చాం. అరగంట పట్టింది. కానీ అలసట అనిపించలేదు. డాక్టర్ శేఖర్ ఏం మాట్లాడుతున్నాడో నేనేమి జవాబులు చెబుతున్నానో నాకే తెలీదు. "కాఫీ తాగుదామా" అని శేఖర్ అడిగాడు. సరేనన్నాను. దగ్గరలో ఉన్న రెస్టారెంట్‌కు వెళ్లాము. ఈ చిన్నచిన్న రెస్టారెంట్లలో సాధారణంగా ఏ ఇటాలియన్సో ఉంటారు.

"సాండ్‌విచ్ తీసుకొందాం".

సరేనన్నాను. సాండ్‌విచ్ ఫిల్లింగ్‌కు రకరకాల కాంబినేషన్స్ ఉన్నాయి. కంటికి ఎదురుగా నోరూరిస్తున్నాయి. వైట్ సాస్‌తో ఉన్న ఫిల్లింగ్ ఎన్నుకొన్నాను. యాంత్రికంగా తింటూ మధ్యమధ్య వేడి కాఫీ సిప్ చేస్తున్నాను.

"ఏమిటి చాలా ఆలోచనలో పడ్డారు?" అన్నాడు డాక్టర్ శేఖర్. ఏమీ లేదంటూ నవ్వాను.

ఆ రోజు గది చేరుకోగానే నేను చేసిన మొదటి పని తలుపు బిగించి పక్కపై వాలి స్ఫూర్తి పుస్తకం చదవటం. ఓవర్‌కోటు మాత్రం తీసి హాంగరుకు తగిలించాను. తక్కిన బట్టలు మార్చుకొనే ధ్యాసే లేదు.

ఆ పుస్తకం ఒక కథల సంపుటి. స్ఫూర్తి కాలేజీ చదివే రోజుల్లోనే సాహిత్యంపట్ల చాలా ఆసక్తి చూపించేది. మరి తను సోషియాలజీ ఎందుకు తీసుకొందో నాకు అర్థంకాలేదు. తను పదహారు పదిహేడేళ్ల వయసులోనే ఏవేవో కథలు వ్రాసి పత్రికలకు పంపించేది. అవి తిరిగి వస్తుండేవి. అప్పుడు తన బాధ చెప్పనలవి గాకుండా ఉండేది. తను ఆ బాధ మరచిపోవడానికి వేరే ఏవేవో కబుర్లు చెప్పేవాడిని. జోక్స్ వేసేవాడిని. "నా జీవితంలో ఏ కోరిక తీరినా తీరకపోయినా నేను గొప్ప రచనలు చెయ్యాలి" అంటూ ఉండేది. నేను తనను బాగా ఏడిపించేవాడిని.

"రచనలు చెయ్యటం పేరు తెచ్చుకోటం, అందులో గొప్ప రచనలు చెయ్యటం పేరు తెచ్చుకోటం ఏ మాత్రం సులభంకాదు. ఎన్నేళ్ళు కృషి చెయ్యాలి! ఎంతెంత చదవాలి! ఎంతెంత జ్ఞానాన్ని వడబొయ్యగలగాలి! ఎంతో శ్రమపడితే, నీ అదృష్టం బాగుంటే కాస్త గుర్తింపు వస్తుంది. ఎంత ఒక నీటి బొట్టంత. ఇలా రావటం అలా ఆవిరైపోవడం. ఈ బాధలెందుకుగానీ కాస్త సినిమా తారగానో, టి.వి. స్టార్‌గానో మారడానికి కృషి చెయ్యి. ఇటు కీర్తి, అటు గుర్తింపూ కావలసినంత పటాటోపం!"

"నేను సీరియస్‌గా మాట్లాడితే నువ్వెప్పుడూ తేలికగా కొట్టిపారేస్తావేం?" కాస్త అలిగినట్లుగా అంది. తనని తిరిగి మూడ్‌లోకి తీసుకురావడానికి చాలా టైమ్ పట్టింది.

మేమిద్దరం పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు కలిసే చదువుకొన్నాం. ఆ రోజు నాకింకా జ్ఞాపకం. అది తన పుట్టిన రోజు. మరునాడే మాకు ఎం.ఎ.ఫైనల్ పరీక్షలు ప్రారంభం. ఏది ఏమైనా మేము కలుసుకోకపోవడమంటూ జరిగేది కాదు. అందునా పుట్టిన రోజున కలవక

పోవటమన్నది అసంభవం. ఆ రోజుల్లో అన్నీ జోక్సే. అన్నిటికీ నవ్వులే. అన్నీ ఆనందాలే. అంతం ఆనందం ఎలా ఉబికివస్తుందో అర్థం కాదు ఇప్పుడు.

తన పుట్టిన రోజు ఉదయం పదకొండు గంటలకు యూనివర్శిటీ లైబ్రరీ దగ్గర కలిశాం. ఆ తర్వాత కాంటీన్ వైపు కదిలాం. బర్త్‌డే విషెస్ చెప్పి తన చేతికి ఒక గులాబీ, ఒక పత్రిక ఇచ్చాను. గులాబీ అందుకొంటూ కళ్లతోనే నవ్వింది. పత్రిక వైపు కాస్త ప్రశ్నార్థకంగా చూస్తూ "ఏమిటిది?" అంది. వెంటనే ఆ పత్రిక నా చేతిలోకి తీసుకొని గబగబా పేజీలు తిప్పి తనకు చూపించాను. తను అప్రతిభురాలైంది. తను కళ్ళెత్తి తిరిగి నన్ను చూడగానే ఆ కళ్ళలో కోటి దీపాలు కనిపించాయి.

"ఓ మై రవీ! ఓ మైడియర్! హౌ హేపీ ఐయామ్! వాట్ ఎ గిఫ్ట్! థాంక్యూ. ఓ లార్డ్ థాంక్యూ" అంటూ ఆకాశంవైపు చూసింది. "రవీ పద. ఈ రోజు కాంటీన్ టీ కాదు. నేరుగా ఐస్‌క్రీం పార్లర్... బాదం మిల్క్ అండ్ ఎ గుడ్ నైస్ కేక్".

"రేపు పరీక్షలు తల్లీ. బజారు వెళ్లామంటే రెండు గంటలు గోవిందా."

"పోనిద్దూ ఇదేం మామూలు దినమా? ఈ సుదినం నేను సువర్ణాక్షరాలతో వ్రాసుకోదగింది. ఆ వ్రాస్తున్న వాడివి నీవే."

అది ప్రథమంగా తన కథ వెలువడిన రోజు. ఆ కాపీ నేను ఇవ్వగలిగినందుకు ఎంత గర్వంగా ఫీలయ్యాననని! స్ఫూర్తి ఒక మహారాణి అయినట్టు ఆమెకు నేనొక రత్నాల కిరీటం పెట్టినట్లు అనిపించింది.

ఆ తర్వాత... ఆ తర్వాత పరీక్షలు, ఫలితాలు, ఉద్యోగాలు, ఇంకా పై చదువులు... పెళ్ళిళ్ళు... అవును. మానవ జీవితాలలో ఎన్నెన్ని మార్పులు! నిత్యమూ, సత్యమూ అనుకొనే సంబంధాలన్నీ అనిత్యంగా, అసత్యంగా ఎందుకు మారుతాయి? కలిసిన చేతులు ఎందుకు విడిపోతాయి? ఒక మార్గమనుకొన్న చోట రెండు భిన్న మార్గాలెందుకు సాక్షాత్కరిస్తాయి? వీటికి సమాధానాలు నాకు తెలీదు. బహుశా ఎవరికీ తెలీదు. ఎంత విజ్ఞానవంతులైనా, ఎంత ప్రాక్టికల్‌గా ఆలోచించేవారైనా హృదయం వారినొక ఆట ఆడించిగానీ ఊరుకోదేమో! కానీ ప్రతి వేదన, ప్రతి దుఃఖం, ప్రతి స్పందన ఒక కొత్త మనిషిని సృష్టిస్తుంది. పుటం పెట్టినట్లు మనిషి పునీతుడవుతాడు.

సరే. స్ఫూర్తి వెళ్లిపోయింది. తన ప్రపంచం, నా ప్రపంచం వేరయ్యాయి. ఇప్పటికి పద్నాలుగేళ్ళు... ఆజన్మ కారాగార శిక్ష కూడా పద్నాలు గేళ్ళంటారు. దానితో ఒక జీవితం ముగిసినట్లు లెక్క కాబోలు. స్ఫూర్తి ఇప్పుడు ఎక్కడుందో, ఏమి చేస్తోందో తెలీదు. నేను తెలుసుకోవాలని ప్రయత్నించనూ లేదు. ఎక్కడో ఒక చోట, ఎప్పుడో ఒకప్పుడు తన కథలు మాత్రం చదువుతూనే ఉన్నాను. అవి నన్ను పిల్లతెమ్మెరలా పలకరించి పోతుండేవి. వాస్తవానికి స్ఫూర్తి నా హృదయాంతరాళంలో ఎక్కడో ఉంది. తన మౌనరాగం వినిపిస్తూనే ఉంది. తనను గురించి ఎప్పుడైనా ఎక్కువగా ఆలోచించానంటే ఏదో ధ్యానముద్రలో ఉన్నట్టనిపిస్తుంది. మనసంతా ప్రశాంతత అలముకొంటుంది. ఆ సరస్సులో ఒక చిన్న అల కూడా కదలదు. ఒక నీటి బుడగ కూడా లేవదు.

ఈ రోజు ఈ దేశంగాని దేశంలో నేను స్ఫూర్తి పుస్తకాన్ని చూసి తనను చూసినట్లే అనుకొన్నాను. ఆ కథలన్నీ ఇదివరకే ఏదో ఒక పత్రికలో చదివినవే. మేము జీవిత పథంలో విడిపోయిన తర్వాత తను సృష్టించిన కథలే.

ఇప్పుడు ఆ కథల్లో నేనేమీ వెతుకుతున్నానో తెలీదు. రచయిత్రి నైపుణ్యాన్నా? ఆమె శిల్పాన్నా? ఆమె సృజనశక్తినా? కాదు నాలో ఏ మూలో దాగి మిణుకుమిణుకుమంటున్న ఆశ. నా ప్రేమ తనలో అంతర్జ్యోతిని వెలిగించిందా? ఆ జ్యోతి వెలుగులు ఈ కథల్లో ప్రతిఫలిస్తున్నాయా? తన పాత్రల్లో నేనెక్కడైనా దాగి ఉన్నానా?

ఆ కథలు మొదటి నుండి చివరిదాకా చదివాను. క్షుణంగా ప్రతి అంశాన్నీ పరిశీలించాను. ఇంకా ఆశ వదలకుండా చదువుతూనే ఉన్నాను. బయటగాలి హోరుమంటూ మూసిన నా కిటికీ తలుపుల వద్ద గోల చేస్తోంది. ఎందుకో పసితనంలో జరిగిన సంఘటన పదేపదే గుర్తుకు వస్తోంది. మామయ్య ఇచ్చిన పది రూపాయల నోటు జేబులో నుండి జారిపోయింది. ఆనాడు ఎంత దుఃఖపడ్డాను! అయినా ఆశ వదల్లేదు. స్కూలు నుండి ఇంటికి, ఇంటినుండి స్కూలుకి పదిమార్లు తిరిగాను ఎక్కడైనా దారిలో కనిపిస్తుందేమోనని. ఆ రోజే కాదు చాలా రోజుల వరకు ఆ విధంగా వెతుకుతూనే ఉన్నాను!

*(12 మే 1991)*